సాక్షి ఒడిశా

శనివారం । 18 । అక్టోబర్ । 2025



ఏనుగుల తిష్ట

గౌరిగుడ గ్రామంలో ఏనుగులు తిష్ట వేశాయి. స్థానికులు భయపడుతున్నారు.

- 10లో



జిల్లాస్థాయిలో మెరిశారు

కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థులు మెరిశారు. చక్కటి ప్రదర్శనలు కనబరిచారు.

- 10లో



శుభ్రమైన చేతులే..

చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత తప్పనిసరి అని చెప్పారు.

- 10లో

న్యూస్‌రీల్

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రమేష్ సాహు

• జనరల్ సెక్రటరీగా పూర్ణిమా ప్రియ దర్శిని



పూర్ణిమా ప్రియ దర్శిని నాయక్



రమేష్ సాహు

కొరాపుట్: అధికార భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రమేష్ సాహు నియమితులయ్యారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ పట్టణానికి చెందిన రమేష్ పార్టీ ఆవిర్భాం నుంచి కొనసాగుతున్నారు. గతంలో పార్టీ జిల్లా అధ్యక్ష పదవితో పాటు రాష్ట్ర పదవులు నిర్వర్తించారు. అలాగే కొరాపుట్ జిల్లాకి చెందిన పూర్ణిమా ప్రియ దర్శిని నాయక్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. పూర్ణిమా కొరాపుట్ జిల్లాలో బీజేపీ పటిష్టానికి కృషి చేశారు. గతంలో జిల్లా స్థాయిలో మహిళా విభాగంలో పార్టీకి సేవలు చేశారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయగడ: సదరు సమితి పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన జేకే పేపర్ మిల్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సీఎస్ఆర్ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రాజెక్టు రోషిని ద్వారా గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పితామహల్‌లోని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో జేకేపూర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు పరీక్షించి 23 మందికి క్యాటరాక్ట్, 27 మందికి దృష్టిలోపం ఉన్నట్టు వైద్యులు గుర్తించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వారికి ఎల్.వి.ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు. శిబిరంలో విజన్ టెక్నీషియన్ జగదీస్ కొండగొరి, జేకే పేపర్ మిల్ అసిస్టెంట్ మేనేజర్ హరిహర ఖమారి పాల్గొన్నారు.


కార్యాలయాల సందర్శన



ఆదర్శ పోలీసుస్టేషన్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మధుమిత

పర్లాకిమిడి: గజపతి జిల్లా కలెక్టర్ మధుమిత శుక్రవారం పర్లాకిమిడిలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. జిల్లా ట్రెజరీ, ఆర్టీవో, ఆదర్శ పోలీస్‌స్టేషన్లను సందర్శించి రికార్డులు పరిశీలించారు. స్థానిక మోడల్‌పోలీస్ స్టేషన్‌లో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత భూపతితో క్రైం రేటుపై సమీక్షించారు.


పౌష్టికాహారంపై అవగాహన



వేదిక మీద సంజుక్త పండా, మల్లేశ్వరి సాహు, లక్ష్మీకాంత్ సొర

కొరాపుట్: పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన ఉండాలని నబరంగ్‌పూర్ మహిళా మహా విద్యాలయం అధ్యాపకురాలు డాక్టర్ సంజుక్త పండా పేర్కొన్నారు. శుక్రవారం మహా విద్యాలయం ఆవరణలో పౌష్టికాహారంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహార అలవాట్లపై లోపంతో మహిళలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. సంప్రదాయబద్ధంగా వస్తున్న మిల్లెట్ల వినియోగం పెరగాలన్నారు. సమావేశం లో ప్రిన్స్‌పాల్ మల్లేశ్వరి సాహు, ప్రొఫెసర్ సునితా పాత్రో, ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ సొర పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ దొంగల అరెస్టు



ల్యాప్‌టాప్ దొంగిలించిన దుండగులు అరెస్టు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహన బ్లాక్‌లో మిషన్ శక్తి కార్యాలయంలో రెండు రోజుల కిందట ల్యాప్‌టాప్‌ను కొందరు దొంగిలించారు. మోహన పోలీసు సిబ్బంది దర్యాప్తు చేసి మోహన బ్లాక్ సంతోషినగర్‌కు చెందిన ఇద్దరు యువకులు అంకిత్ నాయక్, అభిజిత్ పాత్రోలను అరెస్టు చేసి శుక్రవారం మోహన కోర్టుకు తరలించినట్టు ఐఐసి శుభ్రాంత్ పండా తెలియజేశారు.

• ముగిసిన గజలక్ష్మి పూజలు



ఒడిస్సీ నత్య ప్రదర్శన



పూజలందుకున్న గజలక్ష్మి అమ్మవారు

రాయగడ స్థానిక న్యూకాలనీలో ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గజలక్ష్మి పూజలు శుక్రవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహాకాళి, దుర్గా ఉగ్రరూపం, శివ తాండవం, ఒడిస్సీ వంటి నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. చివరి రోజు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– రాయగడ



శివతాండవం



కాళీమాత రూపంలో నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ఆదర్శ విద్యాలయ గేటుకు తాళాలు



ఆదర్శ విద్యాలయం ముందు ప్లకార్డులతో ఆందోళన జరుపుతున్న విద్యార్థులు



ఆదర్శ విద్యాలయ ప్రధాన గేటుకి వేసిన తాళాలు



జయంతిగిరిలో ఒడిశా ఆదర్శ విద్యాలయ ప్రధాన గేటు

జయపురం: జయపురం సమితి జయంతిగిరి ఒడిశా ఆదర్శ విద్యాలయ ప్రధాన గేటుకు విద్యార్థులు తాళాలు వేశారు. విద్యాలయ ఆంగ్ల ఉపాధ్యాయిని వ్యవహార శైలిపై నిరసనగా వారు గేటుకు తాళాలు వేశారు. టీచర్‌కు వ్యతిరేకంగా రాసిన ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. టీచర్ జబాపూర్వబి నాగేశ్ విద్యార్థులపై అవమానకరంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 11వ తరగతిలో గల 17 మంది విద్యార్థులను క్లాస్ నుంచి బయటకు పంపారని వారు ఆరోపించారు. గతంలోనూ ఆమెపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. అందుకే ప్రధాన గేటుకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్నామని పేర్కొన్నారు. కలెక్టర్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని ప్రిన్సిపాల్ సెట్టి వెల్లడించారు.

• ఘనంగా శిశు మహోత్సవం



దండాబడి శిశు మహోత్సవంలో మాట్లాడుతున్న సమితి ఉపాధ్యక్షురాలు పూర్ణిమ బిరిక్

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి దండాబడి పంచాయతీ సాధనా కేంద్రం వారి ఆధ్వర్యంలో శిశు మహోత్సవం సురభి–2025 నిర్వహించారు. సురభి జిల్లా కోఆర్డినేటర్ గోపీనాత్ సెఠి అధ్యక్షతన గురువారం దండాబడి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమంలో నిర్వహించిన సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్య, చిత్ర కళా పోటీల్లో విద్యార్థులు చూపిన ప్రతిభను నిర్వాహకులు ప్రశంసించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బొయిపరిగుడ సమితి ఉపాధ్యక్షుడు పూర్ణిమ బారిక్ పాల్గొని మాట్లాడుతూ సురభి మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. గౌరవ అతిథులుగా దండాబడి గ్రామ పంచాయతీ సర్పంచ్ చెండియ ఖిలో, చిపాకూర్ పంచాయతీ సర్పంచ్ రాజు ఖిలో సమితి సభ్యులు బిమళ ఖిలో, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుధీర్ కుమార్ ప్రధాన్ పాల్గొన్నారు. శిశు మహోత్సవం సురభి–2025 పోటీల్లో 16 పాఠశాలల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలకు స్టార్ క్యాంపెయినర్లు



రమేష్ చంద్ర మజ్జి



మనోహర్ రంధారి



ప్రదీప్ మజ్జి



మున్నా ఖాన్

కొరాపుట్: నువాపడ ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష బీజేడీకి చెందిన స్టార్ కాంపైయినర్ల జాబితాను రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ప్రకటించారు. ఈ జాబితాలో నబరంగ్‌పూర్ జిల్లాకి చెందిన నలుగురు నేతలు ఉన్నారు. జిల్లాకి చెందిన రాజ్యసభ ఎంపీ, ఒడియా సినిమా హీరో మున్నా ఖాన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారీ, మాజీ మంత్రి రమేష్ చంద్ర మజ్జి, మాజీ ఎంపీ ప్రదీప్ మజ్జిలు ఉన్నారు. ఈ నలుగురు నేతలు నువాపడ ఉప ఎన్నికలు ముగిసేంత వరకు అక్కడే మకాం వేయనున్నారు. దీంతో ఆయా నాయకులు తమ తమ అనుచరులతో నువాపడా బయల్దేరుతున్నారు.

కొరాపుట్–విశాఖ మధ్య నిలిచిన రాకపోకలు



ప్రమాదంలో విరిగి పడిన స్తంభం



నిలిచిన వాహనాలు

కొరాపుట్: కొరాపుట్–విశాఖపట్నం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం కొరాపుట్ జిల్లా కేంద్రం సమీపంలో ఓఎంపీ కాలనీ వద్ద జాతీయ రహదారి పై రైల్వే బ్రిడ్జి సమీపంలో ప్రమాదం జరిగింది. కొరాపుట్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఒక ట్రక్ స్తంభాన్ని ఢీకొనడంతో భారీ ఇనుప స్తంభం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వందలాది వాహనాలు ముందుకు సాగలేకపోయాయి. సుదూర ప్రాంతాలకు బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

స్వచ్ఛంద సేవకుడు షణ్ముఖ పాత్రో మృతి



షణ్ముఖ పాత్రో (ఫైల్)

కొరాపుట్: ప్రముఖ గోవిందాలయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు షణ్ముఖ పాత్రో (50) మృతి చెందారు. శుక్రవారం వేకువజామున న్యూఢిల్లీలోని తన నివాసంలో గుండె పోటుకు గురయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించే సరికి తుది శ్వాస విడిచినట్లు ప్రకటించారు. మృతదేహాన్ని నబరంగ్‌పూర్ జిల్లాకి రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా సందాహండి సమితి సొరుగుడ గ్రామానికి చెందిన షణ్ముఖ ప్రాతో సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. నబరంగ్‌పూర్ జిల్లాలో ప్రజల కోసం గోవిందాలయ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ద్వారా అంబులెన్స్ సేవలు, గిరిజన విద్యార్థులకు ఉపాధి రంగాలలో శిక్షణ అందిస్తున్నారు. కాగా షణ్ముఖ సూచించిన విధంగా తన మరణాంతరం అంత్యక్రియలు సొరుగుడలోని గోవిందాలయ ప్రాంగణంలో జరపడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈయన మృతి పట్ల రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గొండో, నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి, ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జిలు వేర్వేరు ప్రకటనలలో సంతాపం ప్రకటించారు. శనివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని గోవిందాలయ వర్గాలు ప్రకటించాయి.

చోరీ కేసులో ముగ్గురు నిందితులకు రెండేళ్ల జైలు



రాయగడ: చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని బీసీ రోడ్డు సమీపంలోని మందుల షాపులో రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్ చోరీ చేసి అరెస్టయిన ముగ్గురు నిందితులకు సంబంధించి ఎస్‌డీజేఎం వర్షా దాస్ శుక్రవారం విచారించి రెండేళ్ల పాటు జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. 2024 అక్టోబరు 17వ తేదీ రాత్రి బిసిస రోడ్డు వద్ద గల బాలాజీ మెడికల్ స్టోర్‌లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి బాధితుడు చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు హేమంత్ కుమార్ రావు, ఎస్‌కే భాషా, బి.వెంకటేష్‌లను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసు విచారణ చేపట్టిన ఎస్‌డిజేఎం వర్షాదాస్ 9 మంది సాక్షులను విచారించి అనంతరం తీర్పునిచ్చారు. అదేవిధంగా పదేసి వేలు జరిమానా కింద చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. చెల్లించకుంటే అదనంగా మరో 6 నెలల పాటు జైలు శిక్షను అనుభవించాలని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి

• ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రాయగడ: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బిలేసు ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ద్వితిచంద్ర సాహుపై దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో భువనేశ్వర్ బుద్ధనగర్ ప్రాంతానికి చెందిన అర్జున్ ప్రధాన్, పీడబ్ల్యూడీ బస్తీ పరిధి కొదలి గోదాం ప్రాంతంలో నివసిస్తున్న సునీల్ నాయక్‌లుగా గుర్తించారు. నిందితుల నుంచి పోలీసులు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు. గత సోమవారం ఉపాధ్యాయుడు భువనేశ్వర్‌లో జరిగే ఒక సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో భువనేశ్వర్ రైల్వేస్టేషన్ 6వ నంబర్ ప్లాట్‌ఫారంలో దిగి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో అతనిపై దుండగులు దాడిచేసి సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఈ ఘటనలో ఉపాధ్యాయుడి తలకు తీవ్రగాయాలయ్యాయి. అనంతరం ఆయన లక్ష్మీసాగర్ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

సెక్షన్ ఆఫీసర్‌ను చుట్టుముట్టి..



రాయఘడ బ్లాక్‌లో టాటా జూనియర్ ఇంజినీరును చుట్టుముట్టిన పలు గ్రామాల ప్రజలు



చీకట్లో టాటా జూనియర్ ఇంజినీరును చుట్టుముట్టిని గ్రామస్తులు

పర్లాకిమిడి: అక్టోబరు రెండున భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి అనేక విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రాయఘడ బ్లాక్‌లో పెక్కట, రంగలా సింగి, భిన్నడ, బరబ, పరాజీ వంటి పలు గ్రామాల్లో గత పదిహేను రోజులుగా ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. అనేక సార్లు గ్రామస్తులు విద్యుత్ పునరుద్ధరణకు విన్నవించినా టాటా పవర్ డిస్ట్రిబ్యూషన్ అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం పెక్కట గ్రామానికి విచ్చేసిన విద్యుత్ సెక్షన్ ఆఫీసర్‌ను ప్రజలు చుట్టుముట్టి రాత్రి చాలాసేపు గ్రామంలో ఉంచారు. పలు గ్రామాల ప్రజలు జూనియర్ ఇంజినీరు (ఎలక్ట్రికల్) చుట్టుముట్టి నిలదీయడంతో... చివరకు విద్యుత్ రెండు రోజుల్లో పునరుద్ధరణ చేస్తానని హామీ ఇవ్వడంతో ప్రజలు అక్కడి నుంచి విడిచిపెట్టారు.

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఐఈఈఈ దినోత్సవం



సెంచూరియన్ వర్సిటీ ఐఈఈఈ దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా, వీసీ సుప్రియా పట్నాయిక్, డాక్టర్ దేవేంద్ర కుమార్ సాహు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో అంతర్జాతీయ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ డేను ఘనంగా ఓపెన్ ఆడిటోరియంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ దేవేంద్రకుమార్ సాహు స్వాగత ఉపన్యాసం ఇవ్వగా, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ప్రఫుల్ల కుమార్ పండా మాట్లాడారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో ఇటీవల నూతన ఆవిష్కరణలు, పరిశోధన, వివిధ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాల్లో ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్రో, వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయిక్, విశ్రాంత ఐటీఆర్ (భువనేశ్వర్) డైరెక్టర్ హెచ్‌కే రథ్, డీఆర్‌డీఓ, ఐఐటీ, భువనేశ్వర్ డాక్టర్ ప్రద్యుత్ కె.బిశ్వాళ్ తదితరులు ఐఈఈఈ పై అనర్గళంగా మాట్లాడారు.

ఆస్పత్రి సిబ్బంది దురుసు ప్రవర్తన



చికిత్స కోసం ఆశా కార్యకర్తతో వచ్చిన రవీంద్ర నాగవంశి



రక్త నమూనాల ల్యాబ్ వద్ద బారులు తీరిన రోగులు

రాయగడ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. రోగిని తీసుకొచ్చిన ఆశా కార్యకర్తపై హస్పిటల్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించాని ఆశా కార్యకర్త అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని కాసీపూర్ సమితి డంగలొడి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త పుష్పాంజలి బెవుర ఈనెల 10వ తేదీన అదే గ్రామంలో నివాసముంటున్న రవీంద్ర నాగవంశి భార్య లఖాబతితో పాటు ఆమె నాలుగు నెలల బిడ్డను చికిత్స కోసం స్థానిక జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకొచ్చారు. ప్రాథమిక వైద్యమందించిన వైద్యులు రక్త పరీక్షలను చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త నమూనాలను ల్యాబ్‌లో సిబ్బందికి ఇచ్చారు. వాస్తవానికి అదేరోజు రక్త పరీక్షలకు సంబంధించి రిపోర్టును ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ల్యాబ్ సిబ్బంది మరుసటి రోజు రమ్మని పంపించారు. వారు చెప్పినవిధంగా మరుసటి రోజు యథావిధిగా రిపోర్టు కోసం ఆస్పత్రికి వచ్చారు. అయితే ల్యాబ్‌లో కొన్ని రిపోర్టులు గల్లంతయ్యాయని చెప్పి తిరిగి పంపించారు. దీంతో రిపోర్టు విషయంపై ల్యాబ్ సిబ్బందిని ఆశా కార్యకర్త ప్రశ్నించగా, సరైన బదులు చెప్పలేదు సరికదా.. దురుసుగా ప్రవర్తించారని వైద్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రోను వివరణ కోరగా ఈ ఘటన తన దృష్టికి వచ్చిందని, అందుకు సంబంధించి దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

క్లుప్తంగా

మార్కెట్ జంక్షన్ వద్ద బీజేపీ శ్రేణుల సందడి


మార్కెట్ జంక్షన్ వద్ద బీజేపీ శ్రేణుల సంబరాలు

పర్లాకిమిడి: స్థానిక మార్కెట్ జంక్షన్ శ్రీ క్రిష్ణ చంద్ర గజపతి నారాయణ దేవ్ విగ్రహం పార్క్ వద్ద బీజేపీ శ్రేణులు సాయంత్రం సందడి చేశాయి. తమ నేత కోడూరు నారాయణ రావుకు బీజేపీ పార్టీ ఉపాధ్యక్షుని పదవికి నామినేట్ అవ్వడంతో హర్షాతిరేకాలతో గజపతి విగ్రహానికి పూల మాలలు వేసి బాణసంచా కాల్చి ముఖ్యమంత్రి మోహన్ మఝికి జేజేలు పలికారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు నబకిశోర్ శోబోరో, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, రోక్కం సతీష్, బల్ల ధనుంజయ తదితరులు ఉన్నారు.

300 గ్రాముల వెండి చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని చినబొందిలీపురం సమీపంలో బాయన్నతోటలో నివాసముంటున్న రిటైర్డ్ డైట్ లెక్చరర్ ఇంట్లో 300 గ్రాముల వెండి చోరీకి గురైంది. రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం .. ఈ నెల 8న సంపతి పురుషోత్తం తన పెద్ద బావమరిది ఇంట్లో జరిగే శుభకార్యానికి భార్యతో కలిసి విశాఖపట్నం వెళ్లారు. కుమార్తె, కుమారులు పుణేలో జాబ్ చేస్తున్నారు. శుక్రవారం ఉదయం వీరి నివాసగృహం మేడ మీద అద్దెకుంటున్న వ్యక్తి కిందకొచ్చి చూడగా తలుపుల తాళాలు పగలగొట్టడాన్ని గమనించి పురుషోత్తంకు ఫోన్‌లో సమాచారమందించారు. ఇంటికి చేరిన పురుషోత్తం బీరువా అరలో వెండి పోవడాన్ని గమనించాడు. లోపలి లాకర్లలో బంగారు వస్తువులు, నగదు భద్రంగానే ఉన్నాయి. కాగా ఈ చోరీ గురువారం అర్ధరాత్రి 1:30 నుంచి 4:20 గంటల మధ్య జరిగినట్లు సమీప సీసీ ఫుటేజీలో దృశ్యాలు కనిపించాయని స్థానికులు అనుకుంటున్నారు. పక్కనే మరో రెండు గృహాల్లోనూ చోరీకి యత్నించి విఫలమైనట్లు తెలుస్తోంది. సీఐ ఈశ్వరరావు, హెచ్‌సీ శివాజీ, క్లూస్‌టీమ్ ఘటనా స్థలికి చేరి పరిసరాలను పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూకే స్కాలర్‌షిప్‌కు అనూష ఎంపిక

పాతపట్నం: బూరగాం గ్రామానికి చెందిన పోలాకి అనూష యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చెస్టర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ హెల్త్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్‌లో చదివేందుకు వైస్ చాన్స్‌లర్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. దీనిలో భాగంగా మొదటి ఏడాది 6,500 పౌండ్లు (రూ.7,67 లక్షలు), రెండో ఏడాదికి ప్లేస్‌మెంట్ పొందింది. ఐఈఎల్‌టీఎస్ పరీక్షలో మంచి స్కోర్ సాధించింది. అనూష తండ్రి పోలాకి గణపతి రైతు, తల్లి పోలాకి వరలక్ష్మి గృహిణి. అనూష జెమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్, నాగార్జున యూనివర్సిటీలో డిప్లమా ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చదివింది.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా అర్జీలు పరిష్కారానికి పోలీసు అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి చెప్పారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ప్రజాగ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని ప్రజల కోసం ప్రత్యేకంగా ఈ గ్రీవెన్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. పౌర సంబంధాలు, కుటుంబ, ఆస్తి గొడవలు, మోసపూరితమైనవి ఇతరత్రా అంశాలపై పలు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించామని తెలిపారు.


కీలుగుర్రం డ్యాన్సు పోటీ


జానపద నృత్యంలో విద్యార్థినులు


సంబల్‌పురి నృత్యం


డ్రాయింగ్ పోటీలలో విద్యార్థులు


మట్టిలో హస్తకళల పోటీలు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఈవో మయాధర్ సాహు


సోలో సాంగ్ పోటీలో గెలుపొందిన నందినీ మల్లిక్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న బిచిత్రానంద బెబర్తా

జిల్లాస్థాయిలో మెరిశారు..

- నేడు జోనల్‌స్థాయి కళా ఉత్సవ పోటీలు

పర్లాకిమిడి: స్థానిక మహేంద్రగిరి పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో కళాఉత్సవం శుక్రవారం జరిగినది. జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా జిల్లా ముఖ్య శిక్షాధికారి డాక్టర్ మయాధర్ సాహు, జిల్లా సైన్స్ కోఆర్డినేటరు అంపోలు రవికుమార్, ఆదనపు డీఈవో గిరిధర్‌లు విచ్చేశారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 12 ఈవెంట్లులో 54 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. కళాఉత్సవంలో వికసిత్ భారత్, వికసిత ఒడిశా 2025 ముఖ్యాంశంగా వోకల్ మ్యూజిక్, సోలో, గ్రూప్, వాయిద్యాలతో మ్యూజిక్, విజ్యువల్ ఆర్ట్, మట్టితో చేసే హస్తకళలు, డ్రాయింగ్ 2డీ, 3డీ, పెయింటింగ్ తదితర అంశాలు ఉన్నాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా, బిచిత్రా నంద బెబర్తా, మురళీధర్ పోరిచ్చా (డ్రాయింగ్), డి.ప్రియాంక (డ్యాన్స్), సునీతా మహారాణా, సులతా శుభదర్శినీ (వోకల్), బబితా పురహిత, జగదీష్ పట్నాయక్, రమాకాంత బోరాడో, బి.రామక్రిష్ణ, ముఖ్యవ్యక్తగా రమాకాంత పట్నాయక్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను సాయంత్రం జరిగిన కార్యక్రమంలో డీఈవో మయాధర్ సాహు అందజేశారు.

విజేతలు వీరే:
హస్తకళల పోటీలో ఎలియా గోమాంగో (కాశీనగర్ వారణాసి ఉన్నత పాఠశాల), ద్వితీయ స్వప్నా, కాశీనగర్, తృతీయ గోతి స్వప్న, గుమ్మాబ్లాక్ జీబ ఉన్నత పాఠశాల విద్యార్థిని గెలుచుకున్నారు. 3డీ పెయింటింగ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా అశోక్ శోబోరో (కాశీనగర్), సుమిత్రా బోరాడో పర్లాకిమిడి, విలియం శోబోరో (గుమ్మా) గెలుచుకున్నారు. ప్రథమ బహుమతులు సాధించిన విద్యార్థులు కోరాపుట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శని, ఆదివారాల్లో జరుగు జోనల్ పోటీలకు వెళ్లాల్సివున్నదని కోఆర్డినేటరు రమాకాంత పట్నాయక్ తెలిపారు. జోనల్‌లో గెలిచిన విద్యార్థులు భుభనేశ్వర్‌లో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని ప్రధాన ఉపాధ్యాయులు పూర్ణచంద్ర ప్రధాన్ తెలిపారు.

శుభ్రమైన చేతులే.. ఆరోగ్యానికి హేతువులు


అతిథులను పుష్పగుచ్ఛాలతో స్వాగతిస్తున్న విద్యార్థులు


గ్లోబల్ హ్యాండ్‌వాష్ దిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు


విద్యార్థులకు సబ్బులు అందజేసిన అతిథులు

జయపురం: జయపురం సమితి కొట్‌పాడ్ సమితి నువాగాం గ్రామంలో గ్లోబల్ హ్యాండ్‌వాష్ దినం పాటించారు. అమరజ్యోతి ఫౌండేషన్, రేకెట్ డెటోల్ స్కూల్ హైజిన్ ఎడ్యుకేషన్ ప్రొగ్రామ్ సహకారంతో ఒడిశా కొరాపుట్ జిల్లా జయపురం సబ్‌డివిజన్ కుంఢ్ర సమితి నువాగాంలో చేతులు శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. చేతుల పరిశుభ్రత ఒక ఆరోగ్య కరమైన సమాజం ఏర్పాటుకు దోహద పడుతుందని కొరాపుట్ జిల్లా కోఆర్డినేటర్, అమర జ్యోతి ఫౌండేషన్ తాపస హొత్త వెల్లడించారు. శుభ్రమైన చేతులు మన ఆరోగ్యానికి దోహద పడతాయని ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన అన్నారు. ప్రస్తుతం ఒడిశాలో 4400 పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పద్మశ్రీ గోవర్ధన పానిక, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు, జాతీయ పురస్కారం పొందిన మహిళ జెమ పాచిక, రాకెట్ కార్పొరేషన్, కార్పొరేట్ వ్యాపార విభాగ డైరెక్టర్ రభి భటనాగర్, అమర జ్యోతి ఫెడరేషన్ అధ్యక్షుడు బిధు భూషణ పండ పాల్గొన్నారు.

గౌరిగుడలో ఏనుగుల తిష్ట

- శియ్యాలీ అటవీ బీట్ సిబ్బంది పెట్రోలింగ్


కాశీనగర్ బ్లాక్ గౌరిగుడ గ్రామంలో తిష్టవేసిన ఏనుగుల గుంపు


అటవీ సిబ్బంది పెట్రోలింగ్

పర్లాకిమిడి: ఆంధ్రలోని పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం నుంచి కాశీనగర్ రేంజ్ శియ్యాలీ పంచాయతీ గౌరిగుడ గ్రామంలోకి శుక్రవారం సాయంత్రం నాలుగు అటవీ ఏనుగులు ప్రవేశించాయి. దీంతో గ్రామస్తులు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధాన్యం, అరటి ఇతర కాయగూరల పంటలు కాస్తున్నాయి. దీంతో శియ్యాలీ అటవీ బీట్ గౌరిగుడ చేరుకుని ప్రజల ప్రాణాలకు ఎటువంటి హాని జరుగకుండా మైక్‌ద్వారా ప్రచారం చేస్తున్నారు. టాటా పవర్ డి స్ట్రిబ్యూషన్, రైల్వే సిబ్బందితో అటవీ అధికారులు కలిసి రాత్రి వేల పెట్రోలింగ్ జరుపుతున్నారు. గౌరిగుడ చుట్టు పక్కల గ్రామాల్లో ఏనుగులు వల్ల పంటనష్టం కలిగిస్తే ప్రభుత్వం అనుకంప పథకం వర్తించనున్నట్టు ఏసీఎఫ్ షైనీశ్రీ దాస్ తెలిపారు.

షిర్డీసాయిబాబా మందిరంలో చోరీ

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలోని షిర్డీగిరిపై షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. పాతపట్నం షిర్డీసాయి బాబా మందిరం వెనుక పక్క ఉన్న వెంటిలేటర్ రంధ్రం ద్వారా దొంగలు లోపలికి వెళ్లి 500 గ్రాముల వెండి పల్లెం, పెట్టిలో రూ.23,150 నగదు, హుండీ కానుకలను చోరీ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు భక్తులు వచ్చి చూసేసరికి చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి మందిరం, హుండీని పరిశీలించారు. సీసీ కెమెరాల వైర్లు తెంచినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

దాతలే దిక్కు..!

- అరసవల్లిలో దయనీయ స్థితిలో పేద కుటుంబం
- మంచానికే పరిమితమైన తండ్రి
- ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కుమారుడు
- వైద్యఖర్చులకు సాయం కోసం ఎదురుచూపులు


నడవలేని స్థితిలో మంచానికే పరిమితమైన రమేష్. పక్కనే ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న కుమారుడు లీలాసాయిక్రిష్ణ

అరసవల్లి: ఆరేళ్ల క్రితం జరిగిన బస్సు ప్రమాదం ఆ ఇంటి యజమాని కాళ్లను చచ్చుబడేలా చేసి మంచానికే పరిమితం చేసింది. అలాంటి స్థితిలో ఉన్న భర్త, పిల్లల బాగోగులు చూసుకుంటూ కుట్టుమిషనే ఆధారంగా జీవనం కొనసాగిస్తున్న ఆ ఇల్లాలికి విధి మరో సమస్యను తెచ్చిపెట్టింది. దీంతో దాతల సాయం కోసం ఆమె ఎదురు చూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. అరసవల్లి ఆదిత్య నగర్ కాలనీలో పేద కుటుంబానికి చెందిన కళ్లేపల్లి రమేష్, సుజాత దంపతులు. రమేష్ ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేసేవారు. ఆరేళ్ల క్రితం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడటంతో రెండు కాళ్లకు ఆపరేషన్ చేశారు. సుమారు రూ.15 లక్షల వరకు వైద్యానికి ఖర్చు అయినప్పటికీ నడవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఇక ఇంటర్ చదువుతున్న కుమారుడు లీలా సాయికృష్ణకు ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ స్థాయి అధికమవ్వడంతో రక్తవాంతులతో బాధపడుతున్నాడు. ఈ కుర్రాడికి బ్రాన్కోసిస్ సమస్య ఉండటంతో బ్రాన్కోస్రోప్ పరీక్షలు చేయించాల్సి ఉంది. ఈ పరీక్షలకు విశాఖపట్నం ఆసుపత్రిలో సుమారు రూ.లక్ష వరకు అవుతుందని.. అంతటి ఆర్థిక స్తోమత తమకు లేదని వాపోతున్నారు. భార్య కళ్లేపల్లి సుజాత ఎంతో కష్టపడి లేడీస్ టైలరింగ్ నేర్పిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఇంతటి దీన పరిస్థితిలో ఉన్న తమను దాతలెవరైనా ఆదుకుని (ఫోన్‌పే నంబర్ 9381442744) కాపాడాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

పింఛన్ ఇప్పించరూ...!

రమేష్‌కు సదరం సర్టిఫికెట్ ద్వారా 66 శాతం అంగవైకల్యం ఉన్నట్లు వైద్యులు ధృవీకరించినప్పటికీ.. ప్రభుత్వం మాత్రం ఇంతవరకు పింఛన్ మంజూరు చేయలేదు. రెండు కాళ్లకు ఆపరేషన్ జరిగి మంచానికే పరిమితమైనప్పటికీ సర్కార్ పెద్దలు దృష్టి సారించడం లేదు. నెలనెలా పింఛన్ వస్తేకుటుంబానికి కొంత భరోసా దక్కుతుందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పింఛన్ మంజూరు చేయాలని రమేష్ కోరుతున్నారు.

మత్స్యకార సామగ్రి దగ్ధం


కొవ్వాడలో కాలిపోయిన షెడ్

రణస్థలం: కొవ్వాడ గ్రామంలో బడె మహందాతకు చెందిన కమ్మల షెడ్ శుక్రవారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతైంది. తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, బాధితుడు మహందాతకు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వాడ తీరంలోని సముద్రం ఒడ్డున తాటి, కొబ్బరి కమ్మలతో షెడ్ ఉంది. అందులో మత్స్యకారులకు చెందిన 12 పెద్ద వలలు, మర బోటు, ఇంజన్ బోటు, తాళ్లు ఉన్నాయి. ఈ షెడ్‌కు విద్యుత్ సరఫరా లేదు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు గ్రామస్తులు చూసేసరికి కమ్మల షెడ్ కాలిపోయి కనిపించింది. గుర్తు తెలియని వ్యక్తులు షెడ్ కాల్చి వేసి ఉంటారని బాధితుడు అనుమానిస్తున్నాడు. సుమారు రూ.25 లక్షలు వరకు నష్టం చేకూరిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఘటనా స్థలాన్ని ఎఫ్‌డీవో గంగాధర్, జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పరిశీలించారు.

చెరువులో ఆక్రమణలు కూల్చివేత


అధికారుల సమక్షంలో జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పొందూరు: లోలుగు గ్రామంలో చెరువు గర్భంలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. లోలుగు గ్రామంలోని 111 సర్వే నంబర్‌లో 5.44 ఎకరాల్లో కూర్మగుండం చెరువు ఉంది. అందులో సుమారు 25 సెంట్లలో 17 మంది షెడ్ల నిర్మాణంతో పాటు కొంతభాగం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. చెరువు గర్భం ఆక్రమణపై కొందరు గ్రామస్తులు పొందూరు తహసీల్దార్ కార్యాలయంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆరు నెలలు క్రితం పొందూరు రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులో 17 మంది 25 సెంట్ల స్థలం ఆక్రమించినట్లు గుర్తించారు. ఆక్రమణలు తొలగించాలని రెండు నెలల క్రితం పొందూరు తహసీల్దార్ ఆర్.వెంకటేష్ నోటీసులు జారీ చేశారు. దీనిపై స్పందన లేకపోవడంతో శుక్రవారం పోలీసుల సమక్షంలో ఆక్రమణలను తొలగించారు. ఈ సమయంలో బాధితులు మాట్లాడుతూ తాము ఈ స్థలాలను 15 ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని, వాటిని ఎలా తొలగిస్తారంటూ అధికారులను నిలదీశారు. సంబంధిత స్థలాన్ని కొనుగోలు చేసి షెడ్డును నిర్మించుకుని పిండిమిల్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నామని అధికారులకు పిసిని శ్యామలరావు తెలిపారు. ఇదే షెడ్డును తొలగించాలని తమకు ఇబ్బంది పెడుతూ, దౌర్జన్యం చేస్తున్నారని, కలెక్టర్ గ్రీవెన్సులో సైతం ఫిర్యాదు చేశానని చెప్పారు. తొలగింపుల్లో వివక్షత చూపుతున్నారంటూ బాధితులు వాదించారు. చెరువు గర్భాలలో చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిని తొలగించరా అని నిలదీశారు. ఈ సమయంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తమ విధులకు అడ్డుపడితే చర్యలు తప్పవని తహశీల్దార్ వెంకటేష్, సీఐ సత్యనారాయణలు ఆక్రమణదారులను హెచ్చరించారు. ఎస్సై వి.సత్యనారాయణ, జి.బాలరాజు, సర్వేయర్ గణపతి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొర్ని కుర్రాడి 'పవర్'

- పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నరాజశేఖరరావు
- జాతీయ స్థాయి పోటీల్లో పతకాల కైవసం


జంషెడ్‌పూర్‌లో జరిగిన పోటీల్లో విజేతగా చమల్ల రాజశేఖరరావు

గార : సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కుర్రాడు జాతీయ స్థాయిలో 'పవర్' చూపిస్తున్నాడు. ఓవైపు ఉద్యోగ సాధనలో నిమగ్నమవుతూనే.. మరోవైపు ఎక్కడ పోటీలు జరిగినా పతకం రావాల్సిందే అన్నట్లుగా ప్రతిభ కనబరుస్తున్నాడు. గార మండలం కొర్ని గ్రామానికి చెందిన చమల్ల రాజశేఖరరావు జిల్లాలో విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాలలో భాగంగా రాజమండ్రిలో కోచింగ్ తీసుకుంటున్నాడు. ఓవైపు చదువుతూనే, మరోవైపు వ్యాయామం పట్ల ఆసక్తి ఉండటంతో అక్కడే భారతీయ వ్యాయామ కళాశాలకు వెళ్లి రెండు పూటలా వ్యాయామం చేసేవాడు. అక్కడ వివిధ రకాలైన కోచ్‌ల పరిచయంతో క్రీడాపోటీలకు కూడా శిక్షణ తీసుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగాలకు స్పోర్ట్సు కోటా కూడా ఉండటంతో ఆసక్తి మరింతగా పెరిగింది. రెండు సంవత్సరాలుగా పలు పోటీల్లో పాల్గొన్న రాజశేఖర్ జాతీయ స్థాయి పోటీల్లో మెరిసాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2015 పోటీల్లో ఫుల్‌పవర్ లిఫ్టింగ్, పుష్ పుల్, బెంచ్‌ప్రెస్ మూడు విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించాడు. గతంలోనూ జంషెడ్‌పూర్‌లో ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించాడు. తూర్పు గోదావరి జిల్లా స్థాయి పోటీలు, రాష్ట్ర చాంపియన్‌షిప్ పోటీల్లో మూడు సార్లు పాల్గొని ప్రథమ స్థానం సాధించాడు.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం..
చంద్రశేఖర్ పదో తరగతి వరకు కొర్ని హైస్కూల్, ఇంటర్మీడియెట్ గురజాడ, డిగ్రీ ఆదిత్య కళాశాలలో చదివాడు. మావయ్యలు మళ్ల యేగీశ్వరరావు, మళ్ల లక్ష్మీనారాయణల ప్రోత్సాహం, అన్నయ్య చమల్ల కృష్ణారావు, సుమలత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సూచనలు చంద్రశేఖర్‌కు ఉపయోగపడ్డాయి. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంపై గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్కాన్ చేస్తే.. స్క్రీన్‌పై పాఠాలు!

- దీక్షా యాప్‌లో ఎన్‌సీఈఆర్‌టీ, స్టేట్ సిలబస్‌లు
- ప్రతి పుస్తకంపైనా క్యూఆర్ కోడ్
- సులువుగా అర్థమయ్యేలా రూపకల్పన


క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాఠ్య పుస్తకాలు

నరసన్నపేట : అనారోగ్యంతో పాఠశాలకు వెళ్లకున్నా.. ఒకవేళ వెళ్లినా పాఠాలు సరిగ్గా అర్థం కాకున్నా విద్యార్థులు చదువులో వెనుకబడిపోతున్నారు. అలాంటి విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం దీక్ష యాప్ అందుబాటులోనికి తెచ్చింది. అందులో ఎన్‌సీఈఆర్‌టీతో పాటు స్టేట్ సిలబస్ పుస్తకాలను కూడా పొందుపరిచారు. విద్యార్థులు సులువుగా పాఠ్యాంశాలను మొబైల్ ఫోన్ స్క్రీన్ ద్వారా చదువుకునేలా రూపకల్పన చేశారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే..
జిల్లాలో 2955 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 264804 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరఫరా చేసిన అన్ని పాఠ్య పుస్తకాలపైనా క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. పాఠ్యాంశంపై విద్యార్థులు పూర్తి పట్టు సాధించేందుకు నిపుణుల ద్వారా దీక్షా యాప్‌ను పొందుపరిచారు. యాప్‌ను సెల్‌ఫోనులో డౌన్ లోడ్ చేసుకొని పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అర్థంకాని పాఠ్యాంశాన్ని సులువుగా అవగాహన అయ్యేలా రూపొందించారు. ఆడియో, వీడియో, క్విజ్, అసైన్మెంట్ వంటి సౌకర్యాలు కల్పించారు. ముఖ్యంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు ఆడియో పాఠాలు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..
సెల్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి దీక్షా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.అందులోకి వెళ్లి వివరాలు నమోదు చేయాలి. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్‌తో స్కాన్ చేస్తే వెంటనే పాఠ్యాంశం తెరపై కనిపిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రభుత్వం కల్పించిన ఈ సౌకర్యంపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నాం. వివిధ కారణాల వల్ల పాఠశాలలకు రాని వారు ఈ యాప్ ద్వారా పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠ్యాంశాలు సులభంగా చదువుకోవచ్చు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.ధనుంజయ్, ఎస్‌జీటీ, రాళ్లపాడు ఎంపీపీ స్కూల్, పోలాకి మండలం

ప్రయోజనకరం..



విద్యార్థుల సౌలభ్యం కోసం దీక్షా యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై కూడా క్యూఆర్ కోడ్ ముద్రించారు. యాప్ ద్వారా పాఠ్యాంశాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థులు సులువుగా పాఠాలు చదవవచ్చు.

– యు.శాంతారావు, ఎంఈఓ, నరసన్నపేట

క్లుప్తంగా

పురుగు మందులు, విత్తనాల సీజ్



పూసపాటిరేగలో అనుమతి లేకుండా ఉన్న విత్తనాలు, పురుగుమందులను సీజ్ చేసిన వ్యవసాయ అధికారి నీలిమ తదితరులు

పూసపాటిరేగ: మండలకేంద్రమైన పూసపాటిరేగ శివారు కొవ్వాడ రహదారిలో గల ఓ లేఅవుట్‌లోని ఇంటిలో అక్రమంగా అనుమతి లేకుండా నిల్వ ఉంచిన అడ్వాంటా కంపెనీకి చెందిన విత్తనాలు, పురుగు మందులను మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ శుక్రవారం సీజ్ చేశారు. సీజ్ చేసిన మొక్కజొన్న విత్తనాలు, పురుగు మందులు విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అక్రమంగా నిల్వచేసిన విత్తనాలు, పురుగు మందులను అనుమతి లేకుండానే రైతులకు నేరుగా సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గత ఏడాది కూడా అనుమతులు లేకుండానే పురుగుమందులు, మొక్కజొన్న విత్తనాలు ఈ కంపెనీ సరఫరా చేసినట్లు అధికారులు తెలియజేశారు. 2615 కేజీల మొక్కజొన్న విత్తనాలు, 254 కిలోల పురుగు మందులను సీజ్ చేసినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. ఆమెతో పాటు గ్రామ రెవెన్యూ అధికారి డి.రామకృష్ణ, వ్యవసాయ విస్తరణాధికారి సూరెడ్డి భాను తదితరులు ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు



అంబులెన్స్‌లో బాధితుడిని తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధి కొప్పర గ్రామానికి చెందిన రైతు లావేటి సత్యంనాయుడి(వెంకటరమణ)కి విద్యుత్ షాక్‌తో గాయాలయ్యాయి. శుక్రవారం గ్రామ సమీపంలోని కళ్లం వద్ద విద్యుత్ పంపు సెట్ మోటారు వేసేందుకు వెళ్లగా నేలపై ఉన్న విద్యుత్ లైన్ తగలడంతో ఎడమ కాలికి గాయమైంది. కుటుంబసభ్యుల సమాచారం మేరకు 108 వాహనంలో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి శస్త్ర చికిత్స చేపట్టారు. ప్రస్తుతం రైతు కోలుకుంటున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు.

రెండు బైక్‌లను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న గౌరమ్మ



గాయపడిన వికాస్



చికిత్స పొందుతున్న రాజు

రామభద్రపురం: మండలకేంద్రంలోని పాట్బావాణి కోనేరు సమీపంలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలను కారు ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రగాయాల పాలయ్యారు. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంపై పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని మారుతీ కాలనీకి చెందిన మజ్జి గౌరి నందెన్న అనుపోత్సవానికి వెళ్లింది. అనుపోత్సవం అయిపోయిన తర్వాత ఆమెను తీసుకురావడానికి కొడుకు మజ్జి రాజు, స్నేహితుడు సమ్మెట్ల వికాస్‌లు రెండు ద్విచక్రవాహనాలపై వెళ్లారు. తల్లిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ఇంటికి వస్తుండగా సాలూరు నుంచి వస్తున్న కారు రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ప్రధమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

వైభవంగా సహస్ర దీపారాధన



స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన పూజలనంతరం యాగశాలలో విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం వెండి మంటపం వద్ద సీతారాముల నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారి విగ్రహాలను ఊరేగింపుగా దీపారాధన మంటపం వద్దకు తీసుకువెళ్లి అక్కడున్న ప్రత్యేక ఊయలలో ఆసీనులను చేశారు. అనంతరం సహస్ర దీపాలను వెలిగించి దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, రామగోపాలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పంటదశకు వచ్చినా పూర్తి కాని ఈ క్రాప్..!

- నత్తనడకన సాగుతున్న నమోదు
- జిల్లాలో వరి సాగు 2.42 లక్షల ఎకరాలు
- ఈ-క్రాప్ నమోదు 2.13 లక్షల ఎకరాలు
- మొక్కజొన్న సాగు 24 వేల ఎకరాలు
- ఈ-క్రాప్ నమోదు 12 వేల ఎకరాలు

విజయనగరం ఫోర్ట్: వరిపంట దశకు వచ్చేసింది. కొద్ది రోజుల్లో పంటను కోసేయనున్నారు. అయినప్పటికీ ఈ-క్రాప్ నమోదు పూర్తిస్థాయిలో కాలేదు. ఈ-క్రాప్ నమోదు ఇప్పటికే పూర్తయి సామాజిక తనిఖీ కూడా జరిగిపోవాలి. కాని ఈఏడాది ఈ-క్రాప్ నమోదే ఇంతవరకు పూర్తి కాని పరిస్థితి. ఈ-క్రాప్ నమోదులో జాప్యం వల్ల సామాజిక తనిఖీకి అవకాశం ఉండకపోవచ్చు. దీని వల్ల ఈ-క్రాప్ నమోదులో అవకతవకలు జరిగినప్పటికీ గుర్తించే అవకాశం ఉండదు. ఖాళీగా ఉన్న పంట పొలాల్లో కూడా వరి పంట సాగు చేసినట్లు కొంత మంది ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటివాటిని గుర్తించాలంటే సామాజిక తనిఖీ ద్వారానే సాధ్యం.

ఈ క్రాప్ నదు సాగులో కీలకం

ఈ-క్రాప్ నమోదు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సకాలంలో సెప్టెంబర్ నెలాఖరు నాటికి పూర్తయ్యేది. కానీ ప్రస్తుతం ఆక్టోబర్ నెల మూడో వారం వచ్చినా ఇంతవరకు ఈ-క్రాప్ నమోదు పూర్తి కాని పరిస్థితి. ఈ-క్రాప్ అధారంగానే 2023వ సంవత్సరం వరకు ప్రభుత్వ పథకాలు అందేవి. అంతేకాకుండా అర్హులకు మాత్రమే పథకాలు అందుతాయి. బినామీలకు అస్కారం ఉండదు. పంట సాగుకు విత్తనాలు కావాలన్నా, ఎరువులు కావాలన్నా, పంటను విక్రయించుకోవాలన్నా, పంటనష్టం జరిగినప్పుడు పంటలబీమా పొందాలన్నా ఈక్రాప్ ఉపయోగపడుతుంది.

ఈ-క్రాప్ నమోదు ఇలా

వరి పంట ఖరీఫ్ సీజన్‌లో 2,42 లక్షల ఎకరాల్లో సాగెంది. ఇందులో ఈ-క్రాప్ నమోదు 2.13 లక్షల ఎకరాల్లో పూర్తయింది. మొక్కజొన్న 24 ఎకరాల్లో సాగవగా ఈ-క్రాప్. 12 వేలు ఎకరాల్లో ఈ క్రాప్ నమోదైంది. అలాగే పత్తి 4600 ఎకరాల్లో సాగవగా 4300 ఎకరాల్లో నమోదైంది. చెరుకు పంట 5400 ఎకరాల్లో సాగవగా 3500 ఎకరాలకు ఈ-క్రాప్ నమోదైంది.



విజయనగరం మండలం జొన్నవలస గ్రామంలో పంట దశలో ఉన్న వరి పంట



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలు:

- పంటల బీమా వర్తిస్తుంది
- పంట రుణాలు తీసుకోవచ్చు
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుకోవచ్చు
- పండించిన ధాన్యాన్ని అమ్ముకోవచ్చు.

వేగవంతం చేశాం

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేశాం. ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేస్తాం.

భారతి, జిల్లా వ్యవసాయ అధికారి

నకిలీ మద్యంపై విస్తృత తనిఖీలు

- అబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ చౌదరి

విజయనగరం రూరల్: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 225 దుకాణాలు, 26 బార్ అండ్ రెస్టారెంట్లలో కల్తీ మద్యం విక్రయాలు జరగకుండా విస్తృత తనిఖీలు నిర్వహించామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై. శ్రీనివాస చౌదరి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఎక్కడ నకిలీ మద్యం దాఖలాలు కనిపించ లేదన్నారు. లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాలు, బార్లు, ఇన్ హౌస్ సంస్థల కార్యకలాపాలను, అలాగే నాణ్యమైన, సురక్షితమైన మద్యం మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అయితే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలలో నిర్ధారణకాని, అక్రమంగా తయారైన మద్యం చలామణి జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశాల మేరకు నకిలీ మద్యంపై విస్తృత తనిఖీలు చేపట్టి మద్యం దుకాణాల్లో సహకరించిన నమూనాలను ల్యాబ్ లకు పంపించి నిర్ధారణ చేసుకోనున్నామన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. శ్రీనాథుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ శ్రీనివాస్ చౌదరి, ఈఎస్ శ్రీ నాథుడు

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామానికి చెందిన వివాహిత వర్రి జానకి శుక్రవారం ఉదయం 9:30 గంటల సమయంలో తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్న క్రమంలో నొప్పిని తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొంతుతున్నట్లు కేంద్రాస్పత్రి అవుట్ పోస్ట్ పోలీస్ అధికారి ఎస్. భాస్కర రావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గుప్తేశ్వర రావు

విజయనగరం క్రైమ్: విజయనగరంలోని కృష్ణా థియేటర్ దగ్గర ఉంటున్న గుప్తేశ్వర రావు (39) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఇందుకు సంబంధించి విజయనగరం వన్ టౌన్ సీఐ చౌదరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుప్తేశ్వర రావు కృష్ణాథియేటర్ లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5 వ తేదీన నైట్ డ్యూటీకని వెళ్లి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లు, ఇరుగుపొరుగు వారిని స్నేహితులను సంప్రదించినా ఆచూకీ దొరకలేదు. దీంతో గుప్తేశ్వర రావు భార్య లక్ష్మి స్టేషన్ కు వచ్చి భర్త కనిపించడం లేదని శుక్రవారం ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఆర్వీఆర్‌కే చౌదరి తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: రుణాల మంజూరుతో పాటు రికవరీపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల రికవరీ సక్రమంగా ఉంటేనే మరిన్ని రుణాలు మంజూరుకు బ్యాంకులకు అవకాశముంటుందని చెప్పారు. పీఎంఈజీపీ, పీఎంవిశ్వకర్మ, ముద్ర, స్టాండప్ ఇండియా, నాబార్డు రుణాల మంజూరు, రికవరీ పురోగతిని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాబార్డు అమలు చేస్తున్న ఆగ్రిక్లినిక్-అగ్రి బిజినెస్ సెంటర్ పథకం కింద వ్యవసాయ విద్యార్థులు 'అగ్రిప్రెన్యూర్స్'గా మారి రైతులకు సాంకేతిక సేవలు, సలహాలు అందించవచ్చని తెలిపారు. నాబార్డు డీడీఎం నాగార్జున మాట్లాడుతూ ఈ పథకం కింద 45 రోజుల ఉచిత శిక్షణ, గరిష్టంగా రూ.20 లక్షల వరకు వ్యక్తిగత రుణం, రూ.కోటి వరకు గ్రూపు రుణం, మహిళలు, ఎస్సీ/ఎస్టీ, హిల్ ప్రాంతాల అభ్యర్థులకు 44 శాతం వరకు సబ్సిడీ అందుబాటులో ఉందని వివరించారు. సమావేశంలో ఎల్‌డీఎం రమణమూర్తి, బ్యాంకు ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరంత మెప్మా ముద్రించిన 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

వార్డెన్లు బాధ్యతాయుతంగా పనిచేయాలి

జిల్లాలోని అన్ని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలలు మరింత మెరుగుపడేలా వార్డెన్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు శుభ్రత, సురక్షిత తాగునీరు, నాణ్యమైన ఆహారం, అవసరమైన సౌకర్యాలు అందించడంతో పాటు, వారి భవిష్యత్తు కోసం మంచి విద్య, కెరీర్ మార్గదర్శకం ఇవ్వాలని సూచించారు. సమీక్ష సమావేశంలో బాలల సంరక్షణ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, సామాజిక సంక్షేమ శాఖ డీడీ వెంకటేశ్వరరావు, డీబీసీడబ్ల్యూఓ జ్యోతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ టి.విమల, డీఈఓ మాణిక్యంనాయుడు, సమగ్ర శిక్ష పీఓ డాక్టర్ రామారావు, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని మృతదేహం

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి గ్రామం సమీపంలో గల తిరుపతిరావు చెరువులో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గమనించి కొత్తవలస పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సీఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుడికి సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు వయస్సు ఉండి, ఐదున్నర అడుగుల ఎత్తు ఉన్నట్లు గుర్తించారు. నల్లని హాఫ్‌షర్ట్, ట్రాక్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వీఆర్‌వో సూర్యకళ ఫిర్యాదు చేయగా శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించినట్లు సీఐ తెలిపారు.

రైలు పట్టాలపై..



రైల్వేట్రాక్‌పై గుర్తించిన మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రైల్వేస్టేషన్ పరిధి కొత్తవలస కంటకాపల్లి రైల్వే మార్గంలో పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహాన్ని జీఆర్పీ సిబ్బంది శుక్రవారం కనుగొన్నారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 మధ్య ఉంటుదని, ఐదడుగుల ఆరు అంగుళాల పొడవు, చామనచాయ రంగుతో ఉండి తెలుపు రంగు పుల్‌హ్యాండ్స్ షర్ట్, బ్లూకలర్ జీన్ ప్యాంట్ ధరించి, ఎడమ చెవికి రింగ్ ఉందని జీఆర్పీ హెచ్‌సీ అశోక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 919490617089, 6301365605 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్య




లక్ష్మణరావు మృతదేహం

మక్కువ: మండలకేంద్రంలోని గొర్లివీధికి చెందిన గొర్లి లక్ష్మణరావు(55) మనస్తాపంతో చెట్టుకు ఉరివేసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాల ప్రకారం లక్ష్మణరావు కుమారుడు అనంత కుమార్‌కు, దబ్బగెడ్డ గ్రామానికి చెందిన పద్మావతితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. కోడలికి మక్కువకు చెందిన ఓ వ్యక్తితో పెళ్లికి ముందునుంచే, వివాహేతర సంబంధం ఉండడంతో, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తగా వేరు,వేరుగా ఉంటున్నారు. ఇటీవల అనంతకుమార్ భార్య పద్మావతి అనంతకుమార్‌తో పాటు, కుటంభసభ్యులపై గృహహింస, మెయింటనెన్స్, డొమెస్టిక్ వయోలెన్స్ కేసులు వేసింది. దీంతో అనంతకుమార్ తండ్రి లక్ష్మణరావు మనస్తాపం చెంది, స్థానిక సువర్ణముఖి నది సమీపంలో ఉన్న తన పశువుల కళ్లం వద్ద గల చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. తండ్రి లక్ష్మణరావు మృతిపై, కుమారుడు అనంతకుమార్ పోలీసులకు ఫిర్యాదుచేయగా, కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాలూరు సీహెచ్‌సీపీ తరలించారు. లక్ష్మణరావుకు భార్య సీతాలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మద్యానికి బానిసై మరో వ్యక్తి..

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన బొబ్బరి స్వామినాయుడు(51) మద్యానికి బానిసైనందున భార్య మందలించిందని ఈ నెల 15వ తేదీన పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ షణ్ముఖరావు తెలిపారు. స్వామినాయుడు నిత్యం మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతూ ఆరోగ్యాన్ని పాడు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న స్వామినాయుడు పూటుగా మద్యం తాగడంతో భార్య మందలించగా మనస్తాపం చెందిన ఇంటి వద్ద గల పురుగు మందును తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి కోడలు జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధుడు..



ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి మృతదేహం

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి వెంటి తాడి అగ్రహారానికి చెందిన మహంతి అప్పలనరసయ్య (76) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై రూరల్ స్టేషన్ ఎస్సై అశోక్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీటి అగ్రహారానికి చెందిన అప్పలనరసయ్యను పలు అనారోగ్య సమస్యలు పీడిస్తున్నాయి. వయస్సు పెరగడం, ఆపై ఇంటికి భారం కావడంతో పాటు అనారోగ్య సమస్యలు వేధిస్తుండడంతో మనస్తాపం చెందిన ఆయన ఇంట్లోనే పురుగు మందు తాగి స్పృహ తప్పిపోవడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం సర్వజన హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై మృతుడి పెద్దకుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఫెన్సింగ్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ బాల, బాలికల ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విజ్జీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో 14 సంవత్సరాల లోపు వయస్సు గల బాల, బాలికలకు అవకాశం కల్పించగా.. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారికి పోటీలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన పడగల కనిష్(ఫైల్), ఎం.డి షేక్ అహ్మద్ (ఫైల్), జె.శ్యాం శశాంక్ (ఫైల్), ఎన్ఎం జితేంద్ర (ఫైల్), బి .హర్ష వర్ధన్ (ఇప్పి), బి.ఆదిత్య వర్ధన్ (సేబర్), పి.శారద (ఫైల్), బి.హన్సి శ్రీవల్లి (సేబర్) విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18న కాకినాడలో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు చీఫ్ కోచ్ డీవీ చారి తెలిపారు. ఈ ఎంపిక పోటీలను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకర సతీష్‌కుమార్, వ్యాయామ అధ్యాపకురాలు సౌదామిని ,ఎన్ఐఎస్ కోచ్ అప్పలరాజులు పర్యవేక్షించారు.

గంజాయి కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు



గంజాయి కేసు వివరాలు తెలియజేస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైమ్: విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2022 లో నమోదైన గంజాయి కేసులో అస్సాం రాష్ట్రానికి చెందిన ముద్దాయి (ఎ1) ఆకాష్ ఖుడా (22)కు మూడేళ్లు కఠిన కారాగార శిక్ష రూ.10వేల జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ శుక్రవారం తెలిపారు. ఈ కేసు వివరాలిలా ఉన్నాయి. విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలో 2022 సెప్టెంబర్ 19 వ తేదీన ఒక లాడ్జిలో ముగ్గురు వ్యక్తులు మూడు బ్యాగులతో అనుమానాస్పదంగా ఉన్నట్లు పోలీసులకు వచ్చిన కచ్చితమైన సమాచారంతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 4.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రాలను దాఖలు చేశారు. మూడేళ్ల తర్వాత కోర్టు విచారణలో నిందితుడు ఆకాష్ ఖుడా (22)పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష రూ.లక్ష జరిమానా విధించారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులపై నాన్ బెయిలబుల్ వారంట్లు పెండింగ్ లో ఉన్నాయని ఎస్పీ తెలియజేశారు.

హోంగార్డు కుటుంబానికి 'చేయూత'



ఉద్యోగవిరమణ పొందిన హోంగార్డుకు చేయూత చెక్కులు అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కె.సూర్యనారాయణకు 'చేయూత' కింద రూ.3,18,790ల చెక్కు, కో ఆపరేటివ్ నుంచి రూ.32,017ల చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ శుక్రవారం అందజేశారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మృతి చెందిన, ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న హోంగార్డులను అభినందించారు.

కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీపీఓ ఏఓ పి.శ్రీనివాసరావు, హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, కో ఆపరేటివ్ డైరెక్టర్ సుశీల పాల్గొన్నారు.

ఏడుగురు తహసీల్దార్లకు ఉద్యోగోన్నతి

విజయనగరం అర్బన్: ఏపీ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్) నిబంధనల ప్రకారం 2024-25 ప్యానెల్ ఇయర్‌కు డిప్యూటీ కలెక్టర్ (కేటగిరీ-2)లుగా 35 మంది తహసీల్దార్లు, సెక్షన్ ఆఫీసర్లు ఉద్యోగోన్నతి పొందారు. వీరిలో జిల్లాలో పనిచేసిన ఏడుగురు తహసీల్దార్లు ఉన్నారు. తాత్కాలికంగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో బొండాడ నీలకంఠ రావు, బొంతు రత్నకుమార్, కోరాడ శ్రీనివాసరావు, తాడ్డి గోవింద, మరడాన అరుణకుమారి, వడబోయన పద్మావతి, కాకర ఆనందరావు ఉన్నారు.

ఖైదీలపట్ల వివక్ష కూడదు

- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్



వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిలా న్యాయ అధికార సేవ సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ఖైదీల పట్ల సిబ్బందిగాని, తోటి ఖైదీలు గాని వివక్ష చూపకూడదని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక సబ్‌జైలును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఖైదీల పట్ల వివక్ష చూపిన ఎడల కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని కోరారు. జైల్లో ఉన్న ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్తవ్యమని తెలిపారు. జైల్లో ఉన్న సౌకర్యాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. అనంతరం జువైనల్ జస్టిస్ హోమ్‌ను సందర్శించి అక్కడ ఉన్న ప్యానల్ న్యాయవాదులతో బాల నేరస్తుల పట్ల నమోదు చేస్తున్న కేసులను వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించి సెంటర్‌లో నిర్వహిస్తున్న కార్యకలాపాలు, బాధితులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ పోలీస్ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగిని చూసి చలించిన కలెక్టర్



కలెక్టర్‌కు సమస్య చెప్పుకుంటున్న దివ్యాంగ ఉద్యోగి తండ్రి

విజయనగరం అర్బన్: కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి మానవతా విలువలకు నిదర్శనంగా నిలిచారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎంప్లాయిస్ గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఒక దివ్యాంగ యువతిని చూసి ఆత్మీయంగా పలకరించి, ఆమె సమస్యను తెలుసుకున్నారు. ఎస్.కోట మండలానికి చెందిన తానవరపు రూపశ్రీ దివ్యాంగురాలు. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపిక కాగా కురుపాం మండలానికి పోస్టు కేటాయించారు. దూరప్రాంతం కావడంతో తన శారీరక పరిస్థితుల దృష్ట్యా అక్కడ విధులు నిర్వర్తించడం సాధ్యం కాదని ఆమె కలెక్టర్‌కు వివరించింది. ఆమె బాధ విన్న కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి మానవత్వంతో స్పందించి మాట్లాడుతూ నీ సమస్యను ప్రభుత్వానికి పంపించి మేలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో మొత్తం 27 ఫిర్యాదులు అందగా గత నెలలో వచ్చిన 40 ఫిర్యాదులలో ఎక్కువ శాతం పరిష్కారమయ్యాయని కలెక్టర్ తెలిపారు. ట్రెజరీ, డ్వామా, ఈపీడీసీఎల్, మెడికల్ వంటి విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని విద్యార్థి మృతి



విశాల్ మృతదేహం

విశాఖపట్నం: స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని విజయనగరానికి చెందిన చిలకలపల్లి విశాల్ (21)గా గుర్తించారు. విశాల్ గీతం విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతూ పెందుర్తి ప్రాంతంలోని పురుషోత్తమపురంలో తన మామయ్య ఇంట్లో ఉంటూ కళాశాలకు వెళ్తున్నాడు. గురువారం సాయంత్రం విశాల్ తన స్నేహితుడు సూర్యతో కలిసి కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి హనుమంతవాక మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్తున్న క్రమంలో.. శ్రీకృష్ణాపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన విశాల్ గుండెకు తీవ్ర గాయం తగిలి అంతర్గత రక్తస్రావం జరిగింది. సూర్యకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన విశాల్‌ను స్థానికులు.. ఆరిలోవ పోలీసుల సహాయంతో విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. శుక్రవారం మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.